
కథ



# స్మృతి

## సౌరిస్

ఎంత చక్కగావుంది ఎండ? ఎంత పచ్చగా వున్నాయో చెట్లు!

ఇంత పచ్చగా ఎప్పుడూ చూడలేదు? ఎందుకు చూడలేదూ? ఎందుకూ? అసలు చెట్లూ, పువ్వులూ ఏవీ చూడలేదు.

ఎందుకో?

చల్లనిగాలి వొళ్లంతా తాకి పులకరిస్తోంది. చల్లనిగాలి ఇంత ఆనందమేమిటి? గాజు తలుపులు మూసి రగ్గులు కప్పుకోవాలి గాని!

ఎందుకింత ఆనందం, చెట్లని, గాలినీ ఎండనీ చూసి!

జబ్బుగా ఆస్పత్రిలో ఇన్నాళ్ళూ పడుకుని, తిరిగి ఆరోగ్యమొచ్చినందుకా? నర్సు అంది. 'కొంచెంసేపు తోటలో తిరుగు, కులాసాగా వుంటుంది' అని.

కులాసా ఏమిటి? జబ్బంతాపోయి పూర్తి ఆరోగ్యమొచ్చినట్టనిపిస్తోంది.

ఏం రంగుల పువ్వులు!

కళ్ళు మిరిమిట్లు గొలుపుతున్నాయి.

పువ్వులు! పువ్వులు!

ఎన్నాళ్ళయింది-ఎన్నాళ్ళేమిటి?

ఆసుపత్రికి ముందర ఎక్కడున్నాను?

పువ్వుల్లో చెట్లల్లో తిరుగుతో లేనా?

ఎక్కడ? ఎక్కడ?

రంగుపూసిన గోడలు-ఆc, జ్ఞాపకమొస్తున్నాయి- అద్దాల కిటికీలు తివాసీలు, వాజుల్లో వుండేవి పువ్వులు అలంకరించ ఇవి కావు. ఇవి ప్రాణంతో, జీవంతో, ఎండలో రంగులు చిమ్ముతో గంతులు వేసే పువ్వులు. అవి వాజుల్లో ప్రాణంలేని పువ్వు శవాలు. గోడకి పటాలు, నిర్జీవమయిన చలనంలేని చిత్రాలు. బయట ఒకటే రొద వీధిలో-ధ్వనులు, గణ గణా, టింగ్ టింగ్, డబా డబా, బర్, బర్,

ఏం చప్పుళ్ళవి? ఎందుకూ?

అవును కారు చప్పుళ్ళు- కారుండేదిగా. తళతళలాడుతో, లోపల మెత్తగా హాయిగా.

హాయిగానా? హాయిగా వుండేదా?

ఉండేదిగావును అప్పుడు.



నడక ఎంత బావుంటుంధి?

అప్పుడు కారులో తప్ప ఎక్కడికీ నడిచి వెళ్ళేవాళ్ళంకాదు.

ఎందుకూ? వాళ్ళంటే ఎవరం?

కార్లో నేనూ, ఇంకా ఎవరమో, వుండేవాళ్ళం

కారునడిపే, ఖాకీటోపీ, ఖాకీడ్రెస్, వాళ్ళు? ఇంకా ఎవరు?

బట్టతలతో తనపక్కన ఎవరు?

రత్నం అనేవాడు-! వాడా? ఆc, ఆ కాదు వారు.

ఆ కళ్ళజోడూ, సూటూ, చేతికర్రా, ఆస్పత్రిలో కూడా అప్పుడప్పుడు చూసాను డాక్టర్లూ, నర్సులూ ఏదో చేస్తున్నారు నాకు. ఆ కళ్ళజోడు అద్దాల్లోంచి వానచినుకుల్లాగ మెరిశాయి నీళ్ళు. పెదిమలు వణికాయి.

ఎందుకూ? ఎవరూ?

మరి కార్లో ఎందుకు తిరిగేదాన్ని ఆ కళ్ళజోడు ఆయనతో?

ఆ-రోడ్లు, నల్లటిరోడ్లు, దుమ్మూ, చెత్త, జరీ చెప్పులు మాసిపోవూ? టిస్యూచీర నలిగిపోదూ, నడిస్తే? అందరూ నవ్వరూ నడిస్తే?

ఎందుకు నవ్వుతారు? ఉహు, నవ్వుతారు.

ఎందుకో? మరి ఇక్కడ నడిస్తే?

కాళ్ళకి ముఖమల్ చెప్పులాగుంది కింద మెత్తని గడ్డి.

ఎందుకూ చెప్పులూ?

కాని నర్సు కోప్పడుతుంది వేసుకోకపోతే!

మళ్ళీ చెట్లూ ఆకాశం, కనపడకుండా మంచంమీద పడుకోమంటుంది. చేదు మందులు పోస్తుంది. ఏమిటి ఉత్సాహం నాకు? హృదయం మత్తెక్కుతోంది.

క్లోరఫారమా? కాదు-నిద్రలేదు. నాలోకి సూర్యకాంతి, పూల పరిమళాలతో నిండి ప్రవహిస్తోంది. ఏమిటీ పరిమళం? నాలోంచా? జబ్బుపడి, తేరుకుంటున్న నాలోంచి పొంగుతూ ప్రవహిస్తున్న రక్తంలోంచా, ఈ పరిమళం?

ఆ, ఈ గుబురుచెట్టుకి, విరబారి పూసిన, ఈ తెల్లని పువ్వుల్లోంచి, గాలిలోంచి, దూకి, నా హృదయంలోకి పరిగిడుతోంది పరిమళం. గాలికి వూగి నవ్వుతూ పచ్చని ఆకుల్లోంచి కల కల్లాడుతూ కిందికి రాలుతున్నాయి పూరేకులు.

ఏమిటీ-ఆనందం, ఆహ్లాదం, ఆ పువ్వులని చూసి నాకు?

వాటిదేనా ఈ ఘుమఘుమలాడి మత్తెక్కించే పరిమళం?

ఎప్పుడో చూసినగుర్తు. ఈ పూలు ఈ చెట్టు, ఎక్కడో, ఎప్పుడో చూశాను. గుర్తు రావటంలేదు.

ఈచెట్టు పేరేమిటో, జ్ఞాపకం రావటంలేదు.

నర్సు నడగాలి.

**సుప్రసిద్ధ రచయిత గుడిపాటి వెంకటచలం పెద్దకూతురు సౌరిస్. 85 ఏళ్ళ వయసులో ఈనెల 20న కన్నుమూశారు. ఆమె స్వయంగా కథలు, నవలలు, నాటకాలు రాశారు. 1946-47లో ఆమె రాసిన కథ 'స్మృతి' 'ఆదివారం వార్త' పాఠకుల కోసం అందిస్తున్నాం.**

ఇన్నాళ్ళూ ఈ పూలని, ఈ చెట్లనీ విడిచి ఎట్లా బతికాను? ఎందుకు బతికాను?

ఎందుకు ఈ పూలని, ఇంత ఆహ్లాదాన్నిచ్చే, నవజీవనాన్నిచ్చే ఈ పూలని మర్చిపోయాను?

కాని నిన్ననే చూసినట్టూ, నిన్నటిదాకా అనుభవిస్తున్నట్టూ-ఏవో అందమయిన జ్ఞాపకపు తళుకులు. పగిలిపోయి, మెరిసే రంగు గాజు పెంకుల్లాగ చెదిరిన జ్ఞాపకాలు, ఘనసులో తలపుకు వొస్తున్నాయి అస్పష్టంగా-

ఎప్పుడో అనుభవించి, ఏ కారణంవల్లనో మర్చిపోయిన, నాకే తెలీని, అనుభవాలని, జ్ఞాపకం తెచ్చుకుని, అనుభవిస్తున్నాయి, నా

నరాలు నా రక్తం, నా మనస్సు, నా హృదయం, నేను మర్చిపోయాను. అవి రహస్యంగా భద్రంగా, నాకు తెలీకుండా దాచుకున్నాయి. ఆ అపురూపమయిన, ప్రియమయిన స్మృతులని, తేనెటీగలు మధువును పోగుచేసి దాచుకున్నట్టు.

నాకు స్పష్టంగా చెప్పవు.

ఈ పువ్వులు నాకు ఎప్పుడో చాల ప్రియమయినవి. ఎక్కడో చూశాను ఎవరితోనో!

ఎక్కడా? ఎవరూ? ఏదీ?

ఇక్కడ లేరే? ఇక్కడకాదు. ఎక్కడో!

ఇప్పుడు కాదు. ఎప్పుడో!

చాల ప్రియం తనకి ఆ ఎవరో!

ఈ పువ్వుల లాగనే.

ఈ పూల పరిమళంకన్నా, మధురమయిన మత్తెక్కించే పెదిమలు-

నా పెదిమల మీద.

ఈ చెట్టుకిందనే-నల్లని ముంగురుల మీద చెట్టునించి రాలిన తెల్లని పూరేకులు, ఇట్లానే రాలేవి, నల్లని నుదుటి క్రింద తెల్లని కలువరేకుల్లాంటి కళ్ళు.

ఈ పూలకోసమే అతనితో పరిచయం నాకు. పచ్చని గడ్డిలో చెట్టు నానుకుని, సగం మూతలపడ్డ కళ్ళలోంచి చూస్తో, "కూచో" అంటాడు నన్ను చూసి.

ఎందుకు కూచోనూ!

పట్టు పరికిణీ నలిగిపోతుంది. అమ్మ తంతుంది. "వెళ్ళాలి" అంటాను నేను.

"వెళ్ళితే పూలీను" సన్నని కనుకొలుకుల్లో ఎంత అల్లరి!

"అమ్మ తిడుతుంది"

"సరే, ఇస్తారా"

గుత్తుల గుత్తుల పూలు నా నల్లని జడలో తురుముతాడు.

"మళ్ళీరా" ఆత్రుతా, అనురాగం.

"పూలిస్తే వస్తా"

ఏమయినాడు అతను? ఏం పూలివి? ఎందుకూ ఇట్లా బాధ కలిగిస్తున్నాయి? ఆ-నన్ను పిలుస్తున్నాడు అతను-

ఏమనీ?

"కామినీ, కామినీ"

"ఎందుకు నన్ను పిలుస్తావు?"

"ఈ పూలరాణివి నువ్వు"

ఆ, ఈ పూలచెట్టు, కామిని. జ్ఞాపకమొచ్చింది.

అతను? సూర్యం. నా చిన్నప్పటి స్నేహితుడు. చెలికాడు.

"నన్ను పెళ్ళి చేసుకుంటావా? నీక్కావలసి నన్ని పూలిస్తాను" అన్నాడు ఓ రోజు.

"ఓ, రోజూ నాకు పూలు కోసిపెడితే నిన్నే చేసుకుంటాను."

అతని కళ్ళల్లో, సంతోషం మెరుపులాగ మెరిసింది.

నేను చేసుకున్నది అతన్నేనా?

కాదు జ్ఞాపకమొస్తోంది- మా అమ్మ సంతోషం, ఉబ్బిపోవడం నన్ను ముద్దులాడటం.

ఢిల్లీనించి గొప్ప సంబంధం, ఆస్తి


## కొత్తకోడలు



అత్త: మావాడికి జీడిపప్పు, నాకు ఊతప్ప, మా అమ్మాయికి మసాలా దోశ, చిన్నోడికి చికెన్ అంటే ఇష్టం. మరి నీకు?

కోడలు: వేరుకాపురం

## గిన్నిస్‌బుక్



టీచర్: శ్రీకృష్ణుడు గోవర్ధన గిరిని చిటికెన వేలితో మోశాడు.

విద్యార్థి: అంతా అబద్ధంసార్. అదే నిజమయితే ఆయన పేరు గిన్నిస్‌బుక్‌లో వుండాలి కదా.

ఉద్యోగం, హోదా.

నా గర్వం, నా మోజు ఆ రోజుల్లో తియ్యని సన్నాయిమేళం. తోరణాలు, పచ్చని పందిరి ఇంటినిండా బంధువులు, బయట కార్లు, గాసులైట్ల వెలుగులో జిగజిగ మెరిసే నా నగలు. రవ్వలూ, ముత్యాలూ, పచ్చలూ-స్తంభాన్నానుకుని నీడలో, అతని దిగాలు మొహం.

తెలతెలపోతున్న కామినీ పూలు.

దగ్గిరికి రమ్మని అతని సౌంజ్ఞ. విర్రవీగే నా నడక.

"నువ్వు రాలేదని, నీకోసం తెచ్చాను పువ్వులు."

మల్లెపువ్వులతో కుట్టిన నా జడలో

**ఒక లేత నీలపు చైతన్యం సొరిస్ తాత్వికత, ఆధ్యాత్మికత కలగలిసిన జీవితం ఆమెది. ఒక సృజనాత్మక రచయిత్రిగా విలక్షణమయిన రచనలు చేశారామె. ఆమె రచనల్లో ఎంతో ఆర్ద్రమైంది 'ఆనావీలర్' నవల. క్లుప్తత, సంక్షిప్తత ఆమె కథల్లోని సుగుణాలు. లోలోపలి ప్రపంచాల్ని కుదిపివేసే స్వభావం సొరిస్ రచనల్లో ఉంటుంది.**

చోటులేదు.

"నన్ను చేసుకుంటానన్నావు కదూ?" దిగులూ, నిరాశా, ఆ ప్రశ్నలో మూలిగింది, అప్పుడుకాదు. ఇప్పుడూ.

"మరి ఈ నగలూ, ఈ రవ్వలూ ఇయ్యగలవా?"

అతని మొహంలో ఆశ్చర్యం.

"ఈ పూలకన్నా అవి ఎక్కువా నీకు?"

"నీ పూలు ఎవరిక్కావాలి, ఎక్కడంటే అక్కడే కావాల్సినన్ని పూలు."

"నీకు అవసరం లేకపోయినా, నేనివ్వగలిగినవి, ఇవే తీసుకో!"

సన్నాయి చివరి స్వరంలాగ చీకట్లో కరిగి మాయమయినాడు.

అతని గుర్తూ పూలగుర్తూ లేదు నా మనసుకి. గొప్పలో, ధనంలో, దర్జాలో, మర్చిపోయాను ఆ నాలుగురోజులూ. మళ్ళీ ఒంటరయింది నా జీవితం.

బంధువులూ, కార్లూ, పెళ్ళివారూ వెళ్ళిపోయారు.

నా ఒంటిమీద నగలు మోజుతగ్గి, బరువూ, ఇబ్బంది అయినాయి.

దేనికోసం ఆరాటం?

నా పువ్వులకోసం. వాటిని చూడందే వాసన చూడందే వుండలేను. నిలవలేకపోయాను. వెళ్ళాను.

"సూర్యం, నాకు పూలుకోసేవా?" చంపల మీంచి కారుతున్న కన్నీళ్ళు. పయినించి అతని తలమీద రాలుతున్న పూలు.

"నా పూలరాణి, వొచ్చావా నా పూలకోసం."

పూలమధ్య కావలించుకున్నాడు.

కన్నీళ్ళతో పూలపరిమళం కలిసిన ముద్దులు నా చంపలమీద.

"కామినీ, నువ్వు లేందే నేను బతకను."

"ఛీ, అదేమిటి? నువ్వూ పెళ్ళి చేసుకో మరిచిపోతావు."

దిగులు నవ్వు పాలిపోయిన పెదిమలమీద, నల్లని ఆకాశంలో క్షీణ చంద్రుడిమల్లే వెలవెల బోయింది.

నా ఒడిని నింపాడు పువ్వులతో.

అతని కళ్ళల్లోని చూపుతో, భయంతో వొణికాను. వెనక్కి తిరిగి చూడకుండా పరిగెత్తాను. లోపల నాకే అర్థంగాని బాధ. పూల సువాసనలో భయం, నరాల్ని పీకే బాధ. భరించలేకపోయినాను. విసిరి అవతల పారేశాను.

పూల పరిమళమూ, అతని దిగులుచూపూ జ్ఞాపకమొచ్చినప్పుడల్లా అంతులేని వ్యథ. ఎందుకో నాకు తెలీకుండా.

ఢిల్లీ ప్రయాణం, కొత్త కాపరం. హోదా, దర్జా, గొప్ప ఉద్యోగి భర్త, మరిపించలేదు. నా వ్యసనాన్ని, నా సూర్యాన్ని, అతని కన్నీళ్ళని, నా పువ్వులని.

ఇంటిమీద బెంగ అనుకున్నారు మా అత్తవారు నా దిగులుని చూసి మా వూరికి తిరిగిరాగానే తోటకి పరిగెత్తాను.

(మిగతా 34వ పేజీలో)

## ఈ వారం కవిత్వం

తుల్లిమల్లి విల్సన్ సుధాకర్

# బీరువాలో అస్థిపంజరం

మనకే
మాట్లాడడం ఇష్టంలేదుగానీ
ఆ అస్థిపంజరం
ఎప్పట్నుంచో బీరువాలోనే ఉంది...
కల్లంలో నూర్చి రాసిపోసిన ధాన్యాన్ని
రాత్రికి రాత్రి దొంగలు ఎత్తుకుపోయినట్లు
ప్రాచీన భాషా కిరీటాన్ని
లోకులు ఎగరేసుకుపోయిం తర్వాత
బతికున్నన్నాళ్ళూ
కన్నవాళ్ళను కంటితో చూడనోడు
కాటికెళ్ళిన్నాడు దొర్లిదొర్లి శోకాలు పెట్టినట్లు
ఒక జాతి పేగులు తెగ్గోసుకోడమెందుగ్గానీ
భూమిలో పెరిగే ఉల్లిపాయలా
దుఃఖాన్ని కడుపులో దాచుకోవలసిందే!

"పోలీస్ స్టేషన్ గోడలకు"
ఎబ్బెట్టు రంగులు వేసినట్లు
డింగరి భాషకు దుమువులు తగిలించి
తద్భవ భాష తడిక చాటున
మురిసిపోతుంటాంగానీ
ఈ బాబెల్‌లో
గుండెమీద చెయ్యేసుకుని చెబితే
పట్టుమని పదిముక్కలైనా
కల్తీలేని తెలుగు మాట్లాడగలమా!
అనుకుంటాం గానీ
జాతీయభాష పేరెత్తినా పళ్ళునూరే అరవోళ్ళు
నీళ్ళొదిలినప్పుడు నాట్లేసే రైతులు కదూ...!

కలలు
దారంలేని గాలిపటాలై
రెక్కల్లేని సీతాకోకచిలుకలై పడి ఉన్నప్పుడు
పైకెగరడం నేర్పించింది
అమ్మ ఒడిలాంటి తల్లిభాష కదూ!

గుండె కవాటానికి భాష బీగం ఐనప్పుడు/ ఎవరోయ్!
తల్లి భాషకూ
తల్లి పాలకూ
తల్లి స్పర్శకూ
పర్యాయపదం రచించగలవాడు...!?
జలాశయంలాంటి మాతృభాష నుంచి
వారసత్వ జలాల్ని
గుండె చెలమల్లోకి మళ్ళించుకోలేనప్పుడు
తల్లిపాలు తాగినా
తల్లిభాష మాట్లాడవేం...
మనం/ ఇప్పుడు మాట్లాడుతున్నాంగానీ
ఆ అస్థిపంజరం
ఎప్పట్నుంచో బీరువాలోనే ఉంది... ■

## స్మృతి

(19వ పేజీ తరువాయి)

"సూర్యం! సూర్యం!"
"ఎవరు?"
"సూర్యం లేడా? నువ్వెవరు?"
"అతని చెల్లెల్ని. మా అన్నయ్య చచ్చిపోయినాడు."
"ఏమిటి? ఎప్పుడూ? ఎందుకూ?"
"చాల నెల్లయింది. జబ్బుచేసింది. ఆ రోజున నాతో అన్నాడు. 'చెల్లీ! నేను లేనప్పుడు ఫలానివారమ్మాయి ఎప్పుడొచ్చినా పలుకోసం; కోసే'మని"

బిగ్గిరిగా ఏడ్చాను.

జాలిగా రాలాయి పూలు నా తలమీద.

"పూలు కోసేనా?"

వొద్దు, అతనులేందే నా కెందుకు పూలు?"

మళ్ళీ వెళ్ళలేదు ఆ తోటకి.

బలవంతాన పూలనీ, అతన్నీ నామీద కఠినత్వంపూని, హింసించుకుని మురిపించుకున్నాను.

ధనమూ, హోదా, నా భర్త ఆదరణా త్వరగా మరపింపచేశాయి.

మళ్ళీ ఈనాడు కామినీపూలని చూసేవరకు, ఘనమయిన పర్వతం లోతుల్లోని ఝుర్నలాగు, సముద్రం అడుగున రత్నాల్లాగు, భూగర్భంలోని అగ్గిలాగూ, నాకు కనపడకుండా నా హృదయంలో ఇమిడి దాక్కున్నాయి, ఈ రూపస్మృతులు.

దుఃఖం పొర్లుకొని వొచ్చింది.

"సూర్యం, సూర్యం ఏమయినావు? నా పిలుపు వినపడుతోందా? పూలు కోసెయ్యి, దగ్గిరికి రా."

నా తల తిరుగుతోంది. ఆలోచనలు పరుగిడుతున్నాయి. పూలూ, చెట్లూ, ఆకాశం నా కళ్ళముందు గిరగిరా తిరుగుతున్నాయి.

కళ్ళు తిరిగి చెట్టుకింద కూచున్నాను.

నా తలమీద పూలరేకులు పడుతున్నాయి. "సూర్యం, పైనుంచి పూలవర్షం కురిపిస్తున్నావా?"

తెల్లటి బట్టలు, మెరిసే కళ్ళజోడూ దగ్గరవుతున్నాయి, నా కళ్ళముందు.

"ఏమిటి, మంచులో కూచున్నారా? మీ వయస్సుకి మంచిది కాదు లోపలికి రండి" అంది నర్సు.

"నన్నీ చీకటి గదుల్లో పడుకోపెట్టకండి. నన్నీ చెట్టుకింద వుండనీయండి" అంటున్నాను.

"అదేమిటి రత్నం, లోపలికిరా. మన అమ్మాయి, అల్లుడూ పిల్లలూ వొచ్చారు" అన్నారు కళ్ళజోడు నా భర్త.

అమ్మాయీ, అల్లుడా, వాళ్ళ పిల్లలా? ఇదంతా ఎప్పుడూ?

ఆ కామినీ పూలకి, ఈ కామినీ పూలకీ మధ్య.

సూర్యం అతని కామినీపూలు ఎప్పుడో జరిగిపోయిన కథ, కల. దానికీ నాకూ ఏమి సంబంధం?

నేను పూలరాణిని కాను.

భార్యనీ, తల్లినీ, అత్తగారినీ, అమ్మమ్మని- ఇంతే జీవితం? ■